www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 20 మే 2024

బాటిళ్లు, క్యానుల్లో పెట్రోల్ వేస్తే చర్యలు

సిఐ కె.రజనీకుమార్

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుగొండ సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని మండలాల్లోని పెట్రోల్ బంకుల్లో బాటిళ్లు, క్యాన్లు తీసుకొచ్చిన వారికి విడిగా పెట్రోల్ వేయరాదని పోలీస్‌శాఖ హెచ్చరించింది. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాష్ట్రంలో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకొని పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు పెనుగొండ సిఐ కె.రజనీ కుమార్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెట్రోల్ బంకుల్లోకి వచ్చిన వాహనాలకు మాత్రమే పెట్రోల్ వేయాలని, విడిగా ఎవరికైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా విడిగా క్యాన్లు, బాటిళ్లు తెచ్చి, పెట్రోల్ అడిగితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో వారి వివరాలు అందించాలని ఆయన కోరారు.

కూర 'గాయాలు'..!

భారీగా పెరిగిన కూరగాయల ధరలు
కిలో అల్లం రూ.180 పైనే
కిలో మిర్చి రూ.90కు చేరిక
అదేబాటలో వంగ, బెండ, బీరకాయల ధరలు
వారపు సంతకు రూ.700 వరకూ ఖర్చు
బెంబేలెత్తిపోతున్న జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూరగాయల ధరల మంటలు చూసి జనం అదిరిపడుతున్నారు. నిత్యావసర ధరల భారంతో అల్లాడుతున్న జనానికి కూరగాయల ధరల పెరుగుదల హడలెత్తిస్తోంది. వారపు సంత చేయాలంటే రూ.700లకుపైగా ఖర్చుచేయాల్సి రావడంతో జనం తలలు పట్టుకుంటున్నారు. గడిచిన రెండు వారాలుగా కూరగాయల ధరలు భారీగా పెరిగిన పరిస్థితి నెలకొంది. ఆదివారం రైతుబజార్‌లో కూరగాయలు ధరలు చూసి జనం నోరెళ్ల బెడుతున్నారు. ఇక బహిరంగ మార్కెట్లో ధరల పరిస్థితి గురించి వేరే చెప్పనక్కర్లేదు. కిలో మిర్చి ధర రైతుబజార్‌లో రూ.84కు విక్రయిస్తుండగా, ప్రయివేటు మార్కెట్లలో రూ.వంద పలుకుతున్న పరిస్థితి నెలకొంది. కిలో అల్లం రైతు బజార్‌లో రూ.180 ఉండగా బహిరంగ మార్కెట్లో రూ.200ల వరకూ విక్రయిస్తున్నారు. వంకాయలు, బెండకాయలు రైతుబజార్‌లో కిలో రూ.44లకు విక్రయిస్తుండగా, ఇతర మార్కెట్లలో రూ.50పైనే పలుకుతోంది. బీరకాయలు ఏకంగా కిలో రూ.60 వరకూ అమ్ముతున్నారు. చేమ దుంపలు, చిలగడ దుంపులు, క్యాప్సికం వంటి ధరలు సైతం కిలో రూ.50 నుంచి రూ.60లకుపైనే ఉన్నాయి. ఉల్లిపాయలు రూ.30లకు రైతు బజార్‌లో విక్రయిస్తుండగా, బహిరంగ మార్కెట్లో కిలో రూ.35లకుపైగానే అమ్ముతున్నారు. కొత్తిమీర కట్ట రూ.30 ఉంది. దీంతో వారాంతపు సంత ఖర్చు రూ.700లపైగా దాటిపోతోంది. ఇంత ఖర్చుపెట్టినా వారానికి సరిపడా కూరగాయలు కొనుగోలుచేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో సామాన్య ప్రజానీకం కడుపు నిండా భోజనం చేయలేని పరిస్థితి ఏర్పడింది. వారంతపు సంతతోపాటు ఆదివారం తెచ్చుకునే మాంసాహారంతో కలుపుకుంటే తక్కువగా లెక్కించినా రూ.900 వరకూ ఖర్చవుతోంది. వాచ్‌మెన్‌లు, ప్రయివేటు కంపెనీల్లో పనిచేసే ఉద్యోగుల్లో అత్యధిక మందికి నెలకు రూ.పది వేల వేతనం అందుకోవడమే గగనంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో వారపు సంతకు రూ.900కుపైగా ఖర్చుపెడితే నెలకు దాదాపు రూ.నాలుగు వేలకు పైగా అవుతోంది. వస్తున్న రూ.పది వేల జీతంలో కూరగాయల ఖర్చులకే రూ.నాలుగు వేలు అయిపోతే ఇక ఇంటి అద్దె, కరెంటు బిల్లు, వంట గ్యాస్‌కు, కేబుల్, ఆరోగ్య ఖర్చులకు సంబంధించి ఎలా సర్దుబాటు చేసుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే మోడీ అధికారం చేపట్టాక పెట్రోల్ ధర లీటర్ రూ.110 దాటేసింది. డీజిల్ ధర లీటర్ రూ.వంద పలుకుతోంది. వంటగ్యాస్ సిలిండర్ రూ.850 వరకూ ఉంది. కందిపప్పు, మినపప్పు, పెసరపప్పు వంటి పప్పుల ధరలు కిలో రూ.130లకుపైనే ఉన్నాయి. ఇంటి అద్దెలు 200 శాతం పెరిగాయి. పిల్లల ఫీజులు అదేస్థాయిలో పెరిగిన పరిస్థితి నెలకొంది. అయితే వేతనాలు మాత్రం పెరగలేదు. దీంతో మధ్యతరగతి, సామాన్య ప్రజానీకానికి ధరల పెరుగుదల పెనుభారంగా మారింది. ఇప్పుడు కూరగాయల ధరలు సైతం ఆకాశాన్ని తాకడంతో జనం అల్లాడిపోతున్న పరిస్థితి నెలకొంది. పెరిగిన కూరగాయల ధరలకు సంబంధించి రైతుబజార్లలో సబ్సిడీకి ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే జనానికి మేలు జరిగే పరిస్థితి ఉంటుంది. లేకపోతే సామాన్య ప్రజానీకం కడుపునిండా తినలేని పరిస్థితి కొనసాగుతోంది.

ఏలూరు రైతుబజార్‌లో ఆదివారం పలు కూరగాయల ధరలు ఇలా..

కూరగాయలు	ధర కిలో రూ.
మిర్చి	84
అల్లం	180
బీర	58
ఉల్లి	30
బెండ	44
వంకాయలు	44
టమాట	28
కొత్తిమీర కట్ట	30
చేమదుంపలు	54
కీరదోస	40
కాప్సికం	68
చిలకడ దుంప	40
క్యారెట్	38
దొండ	36
బీట్ రూట్	36
గోరుచిక్కుడు	58

బహిరంగ మార్కెట్లో రైతుబజార్ కంటే కిలోకు రూ.ఐదుపైనే అదనంగా విక్రయిస్తున్న పరిస్థితి.

వైట్‌గట్‌తో.. రొయ్య రైతు విలవిల..!

ప్రజాశక్తి - కాళ్ల

వాతావరణంలో మార్పులతో రొయ్యల చెరువుల్లో వైట్‌గట్ వైరస్ వ్యాధి సోకి రొయ్యలు చచ్చిపోతున్నాయి. నిజానికి వేసవి వనామీకి మంచి సీజన్. అయితే వైట్‌గట్ వైరస్ సోకడంతో ఉప్పుటేరు తీర ప్రాంతమైన కాళ్ల మండలంలో ఆక్వా చెరువుల్లో ఎక్కడ చూసినా మృత్యువాత పడిన రొయ్యలే కన్పిస్తున్నాయి. లాభాల పంటగా గుర్తింపు పొందిన వనామీ రొయ్యల సాగుకు వైట్‌గట్ రైతులను అప్పుల ఊబిలోకి నెట్టేసింది.

మండలంలో పలు గ్రామాల్లో రొయ్యల చెరువుల్లో వైట్‌గట్ వ్యాధి సోకి రొయ్యలు మృత్యువాత పడుతుండడంతో చెరువులను ఖాళీ చేయక తప్పని పరిస్థితి నెలకొంది. ఇది చాలదన్నట్లు వాతావరణ మార్పులతో చేతికందొచ్చిన పంట దక్కుతుందో లేదోనని ఆక్వా సాగుదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వైరస్ సోకి చనిపోతున్న వైనం

వైట్‌గట్ వైరస్ వ్యాధి సోకడంతో రంగు మారిన రొయ్యలు

రొయ్యలు పట్టుబడి పట్టి వ్యాన్‌లోకి ఎగుమతి చేస్తున్న రైతులు

రంగుమారిన వనామి..

20 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. 13 వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. మండలంలో సుమారు 80 ఎకరాల్లోని వైరస్ సోకిన రొయ్యలు చనిపోతున్నాయి. దీంతో కాళ్ల, కాళ్లకూరు, సీసలి, దొడ్డనపూడి, జువ్వలపాలెం, ప్రాతాళ్లమెరక, కలవపూడి గ్రామాల్లో హడావుడీగా పట్టుబడి చేస్తున్నారు. రొయ్యలు కూడా చనిపోతుండడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని వాపోతున్నారు. మొన్నటి 60 కౌంట్ రొయ్యల ధర రూ.320 ఉండేది. ప్రస్తుతం రూ.270 ఉంది. చనిపోయిన రొయ్యలు ఎరుపురంగులోకి మారడంతో వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో గోతుల్లో వేసి పూడ్చుతున్నారు. ముమ్మరంగా రొయ్యల పట్టుబడులు చేయడంతో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

రొయ్య సీడ్‌లో లోపమో, చెరువుల్లో ఉన్న నీటిలో లోపమో, వేసే మేతలో లోపమో తెలియదుగానీ రొయ్య సీడ్ చెరువులో వేసిన నెల రోజులకే మృత్యువాత పడుతోంది. దీంతో ఆక్వా రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. విదేశాల నుంచి వ్యాధి నిరోధకత కలిగిన తల్లి రొయ్యలను దిగుమతి చేసుకుని, అన్ని పరీక్షలూ నిర్వహించి హేచరీల ద్వారా రొయ్య సీడ్ ఉత్పత్తి చేస్తున్నారు.

ఇన్ని జాగ్రత్తలు తీసుకున్న ఇటీవల కాలంలో సీడ్ వేసిన నెల రోజుల్లోపునే వైట్‌గట్ వైరస్ వ్యాధి సోకి రొయ్యలు చనిపోతున్నాయి. నిజానికి వేసవి వనామీకి మంచి సీజన్ అలాంటిది. వైట్‌గట్ వైరస్ సోకడంతో పలు గ్రామాల్లో చెరువుల్లో ఎక్కడ చూసినా మృత్యువాత పడిన రొయ్యలే కన్పిస్తున్నాయి. దీంతో పలు గ్రామాల్లో హడావుడీగా రొయ్యలు పట్టుబడి చేస్తున్నారు. దీంతో రొయ్యల రైతులు సుమారు రూ.లక్షల్లో మేర నష్టపోయారు.

విద్యుత్ బిల్లులకే సరిపోతుంది..

దండు ప్రణవమూర్తిరాజు, ఆక్వా రైతు కాళ్లకూరు

వైరస్ సోకిన రొయ్యలు చనిపోయి నీటిపై తేలుతున్నాయి. పట్టుబడులు నిర్వహించిన రొయ్యలకు అంతగా ధర కూడా పలకడం లేదు. రొయ్యలు 60 కౌంట్ రూ.270కు అమ్ముకుంటున్నాం. విద్యుత్ బిల్లులకే ఆ సొమ్ము సరిపోతుంది. ఆక్వా రైతులు నష్టాల ఊబిలో ఉన్నారు.

నీటి నాణ్యత పాటించాలి..

ఇందిరా ప్రియదర్శిని, ఎఫ్‌డిఒ, కాళ్ల

వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులకు తోడు నాణ్యమైన సీడ్ కొరతతో ఆక్వారంగం అల్లాడిపోతోంది. చెరువులో నిలకడగా ఉండాల్సిన ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలు రావడంతో పిహెచ్ పడిపోయి వనామి రొయ్యలకు వైట్‌గట్ సోకి మృత్యువాత పడుతున్నాయి. చెరువులో రొయ్యలు వ్యాధులు బారిన పడకుండా ఉండాలంటే నీటి నాణ్యత పాటించాలి. అలాగే రొయ్య సీడ్‌కు పిసిఆర్ పరీక్షలు చేసిన తర్వాతే చెరువుల్లో వేయాలి.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు కట్టుదిట్టం

జిల్లా కలెక్టర్, ఆర్ఒ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సాధారణ ఎన్నికల్లో భాగంగా కౌంటింగ్ ప్రక్రియ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని, ఇందులో ఎటువంటి లోటుపాట్లకు తావీయరాదని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలని, ఇందుకోసం ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లో బ్యారికేడింగ్ పూర్తిస్థాయిలో చేపట్టాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో బందోబస్తుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని, వెంటనే ట్రాఫిక్ ప్లాన్ సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద రెయిన్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్నిరకాల ఏర్పాట్లనూ ముందస్తుగానే పూర్తి చేసుకొని కౌంటింగ్ కోసం సర్వం సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో లెక్కింపు కేంద్రాల వద్దకు వివిధ పార్టీల కార్యకర్తలు, ప్రజలు చేరుకొనే అవకాశం ఉన్నందున భారీ వాహనాలను అనుమతించకుండా దారి మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల ప్రవేశ మార్గంలో గుర్తింపు కార్డులు కలిగిన వ్యక్తులను మాత్రమే అనుమతించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తొలుత ఇవిఎంలను కౌంటింగ్ రూములకు షిఫ్ట్ చేసి కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. కౌంటింగ్ సెంటర్లో ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లను ఏర్పాటు చేసి ఇందుకు సంబంధించి సిబ్బంది విధులు కేటాయింపునకు మూడు ర్యాండమైజేషన్లు నిర్వహించి టేబుల్ వైజ్ సిబ్బందిని మూడో ర్యాండమైజేషన్లో ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ప్రవేశించే వారికి సెల్ ఫోన్ అనుమతి ఉండదని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణలో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో జూన్ 4 ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు పక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రతి రౌండ్‌కూ లెక్కింపు వివరాలను డిస్ప్లే బోర్డులో ప్రదర్శించడంతోపాటు, ఎన్‌కోర్ వద్ద అప్‌డేట్ చేస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రతినిధులు, ప్రజలు ఓట్లు లెక్కింపు సజావుగా పూర్తి చేయడానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

బీచ్ వద్ద చిన్నారుల కేరింతలు

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డు కొట్టుకొచ్చే కెరటాలతో, ఇసుక తేన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

సుందరయ్య స్ఫూర్తితో పయనించాలి

వర్ధంతి సభల్లో నేతలు

భీమవరం టౌన్: సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బలరాం, నాయకులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సుందరయ్య పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికై ఉద్యమాలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టుఉద్యమ నిర్మాత, కమ్యూనిస్టు గాంధీ, పీడిత ప్రజల విముక్తి దాత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ ఆదివారం భీమవరం మెంటేవారితోట ఆఫీసులో పార్టీ పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షతన జరిగింది. ప్రజానాట్యమండలి కళాబృందాల పాటల ఆలాపాలన అనంతరం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్ రాయ్‌లు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు, జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, పట్టణ కమిటీ సభ్యులు చెల్లబోయిన వెంకటేశ్వరారావు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చైతన్య ప్రసాద్, కళాబృందం, కార్మిక వాడల నుంచి 200 మంది కార్మికులు పాల్గొన్నారు.

ఆకివీడు : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెఎన్‌వి గోపాలన్

పెనుమంట్ర: ఆరు దశకాల కాలం ఉద్యమమే ఊపిరిగా.. ప్రజా చైతన్యమే లక్ష్యంగా సాగిన పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్ట్ గాంధీగా, గొప్ప ఉద్యమనేతగా చరిత్రలో నిలిచారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ఆదివారం మండలంలోని పొలమూరు సిపిఎం శాఖ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా పలువురు ఘనంగా నివాళులర్పించారు. సాధిస్తాం సుందరయ్య ఆశయాలను.. సాధిస్తాం.. సాధిస్తాం.. అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ సుందరయ్య చాలా ముందు చూపుతో ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి నదీ జలాల సమస్యపై చాలా దురదృష్టం పుస్తకం రాశారని అది నేటికి ఎంతో ఉపయోగకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ సభ్యులు కె.శ్రీరామ్ మూర్తి, సిహెచ్.తిరుమల, పి.సత్యనారాయణ, ఇ.సూర్యనారాయణ ప్రసాద్, సాయి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు

తణుకు: నివాళులర్పిస్తున్న నాయకులు

కె.పద్మజ, జి.మాణిక్యాలరావు, కె.ప్రమోద్, జ్యోతిబస్ పాల్గొన్నారు.

ఆకివీడు : పేద ప్రజల కోసం సర్వస్వం అంకితం చేసిన మహా వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ అన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక వేలంపేట రామాలయం వద్ద బజార్ ముఠా కార్మికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిఐటియు సీనియర్ నాయకులు బొక్క సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తవిటినాయుడు, పింకీ అప్పారావు, సందక ఉదయ కుమారి, దోకల లక్ష్మి పాల్గొన్నారు.

ఉండి: భూస్వాముల కుటుంబంలో జన్మించి కార్మికుల సంక్షేమం కోసం పాటుపడిన నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జెఎన్‌వి గోపాలన్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఉండి, గణపవరం రహదారిలో నిర్మాణంలో ఉన్న ప్రజాసంఘాల భవనంలోను, పెదపుల్లేరు రోడ్డులోని సొసైటీ మిల్లు వద్ద రైస్‌మిల్లు కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలోను పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సొసైటీ రైస్ మిల్లు వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు.



తాడేపల్లిగూడెం:మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఈ కార్యక్రమంలో సిపిఎం మండల పార్టీ కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, కొట్టాడ వెంకటేశ్వరరావు, చీర్ల శేషు, కిల్లారి తవిటి నాయుడు పాల్గొన్నారు.

ఆచంట: భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ధ్రువ తారగా నిలిచిన స్వతంత్ర సమరయోధులు, మహానేత పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక సిపిఎం కార్యాలయ ఆవరణలో సుందరయ్య వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు తోటపల్లి సత్యనారాయణ, తలుపూరి బుల్లబ్బాయి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వల్లూరు గ్రామంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణ రాజు ఆరోగ్యం బాగాపోయిన ఇంటి వద్ద పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణ రాజు, సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్‌విఎన్ శర్మ, సిర్రా నరసింహమూర్తి పాల్గొన్నారు.



పెంటపాడు: నివాళులర్పిస్తున్న బాబూరావు

పెంటపాడు: దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబురావు అన్నారు. సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని పెంచటంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి, భూస్వాములకు వ్యతిరేకంగా భూ పోరాటం నడిపి రాజకారులకు వ్యతిరేకంగా 10 వేల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన ఘనత సుందరయ్యకే దక్కుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చీరల పుల్లారెడ్డి, దూలం ప్రసాద్, బొంకూర్ నాగేశ్వరరావు, ఎ.శీను, ఎ.రాజు, రుద్రవీణ, కొండవీటి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: తెలంగాణ సాయుధ పోరాటంలో అలుపెరగని పోరాటం చేసిన యోధుడు సుందరయ్య అని సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభను ఆదివారం తాడేపల్లిగూడెం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి, చల్లా చంద్రరావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, నరమాల కృష్ణ, మేట్రేడ్డి రమణ, పులిమంతుల రమణ, బంకురు యశోద, పకుర్తి చిన్న అప్పారావు, వడిసెల శ్రీను పాల్గొన్నారు.

నరసాపురం: పేదల విముక్తి కోసం జీవితాన్ని అంకితం చేసిన మచ్చలేని మనిషిగా సుందరయ్య ఎప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోతారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు అన్నారు. ఆదివారం మీరా స్మారక గ్రంథాలయంలో సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆకలి, దారిద్యం లేని సమ సమాజం కోసం పోరాడిన విప్లవకారుడు సుందరయ్య అన్నారు.

నరసాపురంలో..

తణుకు: ఎన్నికల్లో అధికారం చేపట్టే వారు రాష్ట్రాభివృద్ధి కోసం సిపిఎం అగ్రనేత సుందరయ్య రాసిన విశాలాంధ్రలో ప్రజారాజ్యం పుస్తకాన్ని చదవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ సూచించారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక అమరవీరుల భవనం వద్ద వైఎస్ఆర్ పార్కులో ఉన్న సుందరయ్య విగ్రహనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అమర వీరుల భవనం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ, బిస్కెట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, అడ్డగర్ల అజయ కుమారి, కామన మునిస్వామి పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

ఓఎన్‌జిసి పైపులు వేయడంపై గ్రామస్తుల చర్చలు

పైప్‌లైన్‌పై చర్చించుకుంటున్న రైతులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - నరసాపురం

గ్రామాల్లో నుంచి ఓఎన్‌జిసి పైపులు వేయడం ప్రారంభించడంతో మూడు రోజుల క్రితం రైతులకు, అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. తమకు న్యాయం చేయకుండా తమ గ్రామాల నుండి పైపులను ఎలా వేస్తారని రైతులు పట్టుబట్టారు. శుక్రవారం జరిగిన సంఘటనలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ రైతులు, ఓఎన్‌జిసి అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి పనులను నిలిపివేశారు. ఈ నేపథ్యంలో సోమవారం మూడు గ్రామాల రైతులు కలెక్టర్‌ను కలవనున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మండలంలోని యర్రంశెట్టి వారి పాలెం మర్లమ్మ ఆలయము వద్ద యర్రంశెట్టివారి పాలెం, రుస్తుంబాద, సీతారామపురం గ్రామాల రైతులు, గ్రామస్తులు సమావేశమయ్యారు. కలెక్టర్‌తో చర్చించాల్సిన విషయాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పైపులైన్ ద్వారా నష్టపోతున్న రైతులకు న్యాయం జరిగేలా కలెక్టర్‌ను కోరతామని తీర్మానించుకున్నారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉండడంతో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి జి.శ్రీనివాస్, పాలకొల్లు రూరల్ సిఐ కె.సతీష్, ఎస్ఐలు హరికష్ణ, గురయ్య పరిస్థితిని పర్యవేక్షించారు.

పలుచోట్ల కార్డెన్ సెర్చ్

మొగల్తూరు : తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల ఆదేశానుసారం తాడేపల్లిగూడెం డిఎస్‌పి మూర్తి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణంలోని ఆదివారం ఉదయం ఐదు గంటలకు యాగర్లపల్లి, జువ్వలపాలెం శివాలయం వీధిలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు పట్టణ సిఐ.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో ఎటువంటి ధ్రువపత్రాలు లేని నాలుగు మోటారు సైకిళ్లను స్వాధీనపరచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం టౌన్ సిఐ ఎ.సుబ్రహ్మణ్యం, తాడేపల్లిగూడెం టౌన్ ఎస్ఐ జెవిఎన్ ప్రసాద్, కె.సుధాకర్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం, తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, నాగాలాండ్ పోలీస్ సిబ్బంది కలిసి 80 మంది వరకూ పాల్గొన్నట్లు టౌన్ సిఐ.సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఆకివీడు : ఎన్నికల అనంతరం చెలరేగే హింసపై పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తు హెచ్చరిక జారీ చేస్తున్నట్లు ఆకివీడు సిఐ సత్యనారాయణ, ఎస్ఐ బి.నాగబాబులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగానే పలుచోట్ల ముందస్తు జాగ్రత్త కోసం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే రెండో రోజు తాళ్లకోడు జగనన్న కాలనీలో ఈ తనిఖీలు చేస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్, సెక్షన్ 144 సిఆర్‌పిసి, సెక్షన్ 30 పోలీస్ చట్టం అమల్లో ఉన్నందున ఏ ప్రాంతంలో కూడా నలుగురు కన్నా ఎక్కువ మంది ఒకేచోట గుమికూడి ఉండకూడదన్నారు. ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులను, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయటం, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, వదంతులను పెట్టి ప్రచారం చేయవద్దన్నారు. ఉద్దేశపూర్వకంగా సివిల్ తగాదాలను అడ్డుపెట్టుకొని, చట్ట వ్యతిరేకంగా రెండు వర్గాల మధ్య కానీ రెండు పార్టీల మధ్య కానీ గొడవలు సృష్టించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారన్నారు.

మొగల్తూరు : నాటుసారా, అక్రమ మద్యం గుర్తించేందుకు పోలీసులు ఆదివారం తనిఖీలు చేశారు. మండలంలోని ముత్యాలపల్లి పంచాయతీ పరిధి, కట్టావారిమెరక, బంధానవారిమెరక తదితర గ్రామాల్లో డిఎస్‌పి జి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో కార్డెన్ సెర్చ్(తనిఖీలు) నిర్వహించారు. ఈ తనిఖీల్లో సిఐ కె.గోవిందరాజు, ఎస్ఐలు కె.వెంకటరమణ, కె.గుర్రయ్య, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొండ: కార్డెన్ సెర్చ్ పేరుతో ధ్రువపత్రాల్లేని 25 మోటార్ సైకిల్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని పెనుగొండ పోలీస్ స్టేషన్, చెరుకువాడ పరిధిలో పహారాపై అధికారులు ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ సిఐ రజనీకుమార్ ఆచంట, పెనుగొండ ఎస్ఐ రాజ్ కుమార్ సుభాని సిబ్బంది సహాయంతో నిర్వహించామని ఎస్ఐ తెలిపారు.

కంటి వైద్య శిబిరంలో 86 మందికి పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

లయన్ పదం కుమార్ గుప్తా(డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్) ఆర్థిక సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరంలో 86 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో ఆదివారం తాడేపల్లిగూడెం లైన్స్ క్లబ్ ఆధ్వర్యాన క్లబ్ అధ్యక్షులు వంగపండు రామోహనరావు అధ్వర్యంలో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వైద్యుల బృందంతో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉచిత కంటి ఆపరేషన్లు నిమిత్తం 10 మందిని నిడదవోలుకు పంపారు. 15 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. లయన్ రవి కుమార్(యశోద హాస్పిటల్, తాడేపల్లిగూడెం) ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా లయన్స్ క్లబ్ మెంబర్ అవడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని, తన వంతుగా లైన్స్ క్లబ్ తరపున ఎలాంటి సేవా కార్యక్రమాలైనా చేయడానికి ముందు ఉంటానని ఆయన అన్నారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మదన్ మోహన్ అగర్వాల్(రీజియన్ ఛైర్‌పర్సన్) కార్యదర్శి చిన్నం జగదీష్, బాపయ్య శర్మ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి ఆశీర్వాదం ఈనెల 13న అనారోగ్యంతో మృతి చెందాడు. దాంట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు ఈ విషయం తెలుసుకుని మృతుని కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం పంపారు. ఆ కుటుంబానికి తన సానుభూతిని రామరాజు వ్యక్తం చేశారు. రామరాజు పంపిన ఆర్థిక సహాయాన్ని ఈద భోగేష్ మృతుని కుటుంబానికి అందజేశారు. మృతుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.

గరుడ వాహనముపై నిర్వహిస్తున్న గ్రామోత్సవం

వెంకన్న ఆలయంలో యాత్రికుల కిటకిట

ప్రజాశక్తి - కాళ్ల

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళ్లకూరు గ్రామంలో 600 ఏళ్ల పైబడిన చరిత్ర కలిగిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. వెంకటేశ్వరస్వామికి గులాబీ పుష్పములతో విశేషార్చన నిర్వహించారు. వివిధ మేళతాళములతో గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి ఆలయ కళ్యాణ మండపంలో వేద విహితంగా గాజువాకకు చెందిన కాండూరి వెంకట రమణాచార్యులచే స్వామి వారి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ పుష్పమాలికలు శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయం రాజ గోపురంపై విద్యుద్దీప అలంకరణలు ఏర్పాటు చేశారు. సుమారు వేలాది మంది యాత్రికులు విచ్చేశారని ఆలయ ఇఒ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మొగల్తూరు, రామన్నపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా సోమవారం నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్ కుమార్ తెలిపారు. అదనపు విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

ఉప సర్పంచి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - పెనుగొండ

గ్రామాల్లో క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలని, చెడు అలవాట్లకు దూరం చేయడానికి దోహదపడుతుందని ఉప సర్పంచి సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఆరోగ్యం, శారీరకంగా ధృడత్వం పొందుతారని, ఈ క్రీడల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. మండలం దేవ గ్రామంలో గత పదిరోజులుగా జరుగుతున్న అంబేద్కర్ అండర్-17 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌లో విజేతగా తాళ్లపాలెం జట్టు గెలుపొంది విన్నర్‌గా నిలిచింది. విజేతకు మొదటి బహుమతి దేవ ఉపసర్పంచి ఆర్థిక సహాయంగా రూ.3 వేలు ప్రైజ్ మనీ, కప్‌ను స్పాన్సర్ చేసి అందజేశారు. రెండవ బహుమతిగా రూ.1500 క్యాష్, కప్‌ను సబ్బితి జీవన్ రాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పాలపర్తి సుబ్రహ్మణ్యం, నేలపుడి చినబాబు, దొడ్డి చంటి, పాలపర్తి సుమంత్, గూనపాటి చిట్టిబాబు పాల్గొన్నారు.

ఆసనాలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - పెనుమంట్ర

యోగాకు చెందిన ఆసనాల్లో చక్రాసనం విశిష్టమైందని ప్రముఖ యోగా ట్రైనర్ పడాల రామచంద్రా రెడ్డి అన్నారు. ఆదివారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో మార్టేరులో పలువురికి యోగాలోని ఆసనాల గురించి శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా చక్రాసనం వల్ల ఆరోగ్యానికి కలిగే ఉపయోగాల గురించి ఆయన వివరించారు. ఈ ఆసనంలో తల క్రిందికి ఉండుట వల్ల ఎక్కువ రక్తం మెదడుకు సులభంగా పంపబడి, మెదడు కణాలు బాగా పనిచేసి, తద్వారా మొత్తం శరీర ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుందని అన్నారు. వినాల గ్రంథుల స్రావాలను క్రమపరస్తుందన్నారు. ప్రత్యుత్పత్తి వ్యవస్థకు చక్కని వ్యాయామం జరిగి తత్సంబంధ వ్యాధులు తగ్గుతాయని, స్పైనల్ కార్డ్ బాగా సాగదీయుట వల్ల వెన్నుపూసలు సరళముగా ఉండి ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానభ్రంశం చెందకుండా కాపాడబడి, మొత్తం వెన్ను నాడులను ముఖ్యంగా సింపతేటిక్, పేరా సింపతేటెక్ నాడులను ఉత్తేజితం చేయడం జరుగుతుందని రామచంద్రా రెడ్డి వివరించారు.

బాలిక కుటుంబసభ్యులకు పులపర్తి పరామర్శ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం నాచువారి సెంటర్‌లో ట్రాక్టర్ ఢీకొని పుష్పప్రియ(12) మృతి చెందడంతో బాలిక కుటుంబసభ్యులను మాజీ ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు ఆదివారం పరామర్శించారు. గునుపూడి గరువుపేటకు చెందిన దుండి జయరావు మున్సిపల్ ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. అతని కుమార్తె పుష్పప్రియ సెలవులు కావడంతో కరాటే నేర్చుకునేందుకు పార్క్ సమీపానికి రోజూ వెళ్తుంది. తాడేరు వైపు నుంచి భీమవరం వైపు వస్తున్న ధాన్యం లోడు ట్రాక్టర్ బాలిక సైకిల్‌ను ఢీ కొట్టడంతో ఈ ప్రమాదంలో బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. బాలిక కుటుంబ సభ్యులను ఎంఎల్‌ఎ పరామర్శించారు. పరామర్శించిన వారిలో రెడ్డి సత్తిబాబు, కొప్పినీటి శ్రీను, మీసాల రాజు, నల్లం చిట్టిబాబు, పులపర్తి సల్మాన్ రాజు ఉన్నారు.

చిదంబరంకి సత్కారం

నరసాపురం: గన్నాబత్తుల పెదతాత, తులసమ్మ తెలగ కళ్యాణ మండపంలో రాయల్ క్లబ్ నర్సాపురం శాఖ వారి ఆధ్వర్యంలో హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది కలిగినీడి చిదంబరంకి ఆదివారం సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాయల్ క్లబ్ నర్సాపురం శాఖ అధ్యక్షులు, వైఎన్ కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ రావు, క్లబ్ కోశాధికారి కోటిపల్లి వీర వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, ప్రముఖ సీనియర్ న్యాయవాది జివికె.రామారావు, సలాది రామారావు, క్లబ్ మెంబర్స్ పాల్గొని కలిగినీడి చిదంబరాన్ని ఘనంగా సత్కరించారు. మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, వైఎన్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చినిమిల్లి సత్యనారాయణ రావు మాట్లాడుతూ చిదంబరం అంచెలంచలుగా ఎదిగారని, న్యాయవాది వృత్తి పట్ల తాను కనబరిచిన నిబద్ధత, క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం, నాయకత్వ లక్షణాలు వల్ల నర్సాపురం పేరుప్రఖ్యాతులు హైకోర్టులో పెంపొందించారని అన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

పీడిత ప్రజల ఆశాజ్యోతి సుందరయ్య

స్వాతంత్ర సమరయోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సారథి, భారత పార్లమెంటులో తొలి ప్రతిపక్షనేత, త్యాగశీలి, ఆదర్శమూర్తి పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా పలుచోట్ల ఘన నివాళులు

ప్రజాశక్తి - కాళ్ల

పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ప్రతి ఒక్క రాజకీయ నాయకులకు ఆదర్శం, నేటి యువతరానికి ఆయన ఒక స్ఫూర్తిదాయకమని సిపిఎం కాళ్ల మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ అన్నారు. కాళ్లలో సిపిఎం శాఖ ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాళ్ల గ్రామంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ సుందరయ్య లాంటి మహా నేతలు అరుదుగా ఉంటారని, దేశంలో పేద ప్రజలకు తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, ఉండడానికి

పెనుగొండ: ఐద్వా ఆధ్వర్యాన నివాళులు

ఇల్లు, చేసుకోవడానికి పని, దున్నుకునేందుకు భూమి కావాలని సుందరయ్య నిరంతరం ఆలోచించేవారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మండా సూరిబాబు, తిరుమాని శ్రీనివాస్, సుబ్బారావు, గరికి ముక్కల ఆజమ్మ, శాంతమ్మ, వెంకటేశులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి యూనియన్ అధ్యక్షులు సత్తి కోదండరామిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయి రెడ్డి, ఆకుల నారాయణ, కడప ఆంజనేయులు పాల్గొన్నారు.

గణపవరం: నాడు సుందరయ్య కూలీలకు సంఘాన్ని ఏర్పాటు చేసిన ఫలితమే నేడు కూలీలు ఉపాధి హామీ పనుల ద్వారా ఉపాధి పొందగలుగుతున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. ఆదివారం కేశవరంలో ఉపాధి హామీ కూలీల పని ప్రాంతంలో సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పి.లక్ష్మి, ఎం.వెంకటరావు, పీతల శామిల్, తోట మహాలక్ష్మి, పి.గంగావతి, జి.పద్మ, చొప్పర్ల వెంకటలక్ష్మి, అరిగెల సింగ్, అద్దంకి సుబ్బారావు, కోడి సత్యనారాయణ, గుబ్బల సత్యనారాయణ, జి.నాగమణి, పి.పద్మ పాల్గొన్నారు.

పోడూరు: బడుగు, బలహీన వర్గాల ఆశా కిరణం పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో పోడూరు గ్రామంలోని కొత్త పేట, జిన్నూరులో, పండిత విల్లూరులో సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో పోడూరు శాఖ కార్యదర్శి బొంతు శ్రీను, జిన్నూరు శాఖా కార్యదర్శి కొప్పర్తి నరసింహమూర్తి, కాకర వెంకటేశ్వర్లు, బి.బులేసు, వై.బాబురావు, ఎం.కుమార్, బి.నరేష్, సీనియర్ నాయకులు తాళాబత్తుల గాంధీ మాట్లాడారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ఆదివారం సుందరయ్య వర్ధంతి మండలంలోని తూర్పుపాలెం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాఖా కార్యదర్శి కంకటాల భాస్కరరావు, ముడే మోజేష్, కేత కృష్ణారావు, బాలం ధనరాజు, బొక్కా నారాయణరావు పాల్గొన్నారు.

పాలకొల్లు: దక్షిణ భారత కమ్యూనిస్టు నిర్మాత, కార్మిక ఉద్యమ నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సిపిఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. సీనియర్ నాయకుడు వలవల శ్రీరామమూర్తి సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంకు దిగుపాటి రాజగోపాల్ అధ్యక్షత వహించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, డి.రోజామని, సోమేశ్వరరావు, వై.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆచంట: స్వాతంత్ర సమరయోధుడు, ప్రజానేత, కమ్యూనిస్టు సమతామూర్తి సుందరయ్య 39వ వర్ధంతి సభ ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో ఆచంటలోని వంకతాళ్ల చెరువు గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుందరయ్యకు చిత్రపటానికి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కౌలు రైతులు కేతా పూర్ణారావు, కట్టా నాగరాజు, కడలి ప్రభాకరరావు, కుడిపూడి శ్రీను, కేతా మోహనరావు, కోళ్ల సత్యనారాయణ, బండి శ్రీను పాల్గొన్నారు.

పెనుగొండ: విప్లవ పోరాట చరిత్రలో త్యాగాలకు, ఉద్యమ నిర్మాణాలకు చిరునామాగా నిలిచిన భారత కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని శాఖా కార్యదర్శి కప్పల రత్నరాజు అన్నారు. అనంతరం చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కడలి త్రినాథ్, కె.వెంకట్రావు, బజార్ జట్టు కార్మికులు మునియ్య, చలపతి పాల్గొన్నారు.

సుందరయ్య 39వ వర్ధంతిని పెనుగొండలోని దొంగగూడెంలో వ్యవసాయ కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, పశ్చిమగోదావరి జిల్లా మైదాన గిరిజన ప్రాంత అధ్యక్షులు శీలం ఏసు పాల్గొన్నారు.

సుందరయ్య 39వ వర్ధంతి సిద్ధాంతం గ్రామ కరెంట్ ఆఫీస్ కాలనీలో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మావతి మాట్లాడుతూ సుందరయ్య జీవితం ఆదర్శప్రాయం అన్నారు.


గణపవరం: మాట్లాడుతున్న జక్కంశెట్టి సత్యనారాయణ

తణుకు: పీడిత ప్రజల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు, గ్రామ నాయకులు కర్ణాటపు నరసింహారావు కొనియాడారు. పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని వేల్పూరులో స్థానిక మినీ బైపాస్ రోడ్‌లో ఉన్న సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, సంఘ పతాకాన్ని ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, తిరునాదం వెంకటేశ్వరరావు, విశ్వనాథం సుబ్బారావు, కుడక వీరభద్ర రావు, వాటాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: సుందరయ్య వర్ధంతి పురస్కరించుకొని మండలంలోని చించినాడ గ్రామం అమరవీరుల స్మారక భవనం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం సీనియర్ నేత జిల్లెళ్ల ప్రశాంతి అధ్యక్షత వహించారు. సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కానేటి బాలరాజు, నాయకులు సుబ్బారావు, చక్రపాణి, ఏడుకొండలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: పీడిత ప్రజల ప్రియతమ నేత పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం నాయకులు కండెల్లి సోమరాజు పేర్కొన్నారు. మండలంలోని ఇటుకల గుంట గ్రామంలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలుపూరి సత్యవతి, శ్రీనివాస్, పి.నాగమణి, మన్నే గణేష్, పి.పుష్ప పాల్గొన్నారు.

వీరవాసరం: కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో వీరవాసరం, కొనితివాడ సుందరయ్య విగ్రహం వద్ద ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు నరసింహమూర్తి, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగరత్నం, వరలక్ష్మి, నిర్మల, నాగమణి, శాంతి పాల్గొన్నారు.

రొయ్య బతకదు.. ఆశ చావదు..!

వైరస్‌తో ఖాళీ అవుతున్న చెరువులు
భారీగా పెరిగిన విద్యుత్, మేత, మందుల ధరలు
ఆవేదనలో రైతులు
పట్టని మత్స్యశాఖ అధికారులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాష్ట్రానికి అత్యధిక విదేశీ మాదకద్రవ్యాన్ని అర్జించే రంగాలలో ఆక్వా రంగం మొదటి స్థానంలో నిలుస్తుంది. అటువంటి ఆక్వా రంగాన్ని వైరస్ వెంటాడి వేల చెరువులు ఖాళీ అవుతున్నాయి. నేడు ఆక్వా సాగులోని చెరువుల్లో వైట్ కట్(తెల్ల మచ్చ), బ్యాక్ గ్గిల్(తాటాకు తెగులు) బెండ్లుతో పాటు రైతుకు అంతుపట్టని రకరకాల వైరస్‌ల కారణంగా రొయ్య కౌంటుకు రాకుండానే చనిపోవడంతో రైతులు భారీ నష్టాలను చవిచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వైరస్‌లపై రైతులకు అవగాహన కలిగించవలసిన మత్స్యశాఖ అధికారులు ఇటువంటి చర్యలు చేపట్టకుండా చోద్యం చూస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భీమవరం జిల్లా కేంద్రంలో జిల్లా మత్స్యశాఖ ఉన్నప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు కొందరు వాపోతున్నారు. అధికారులైతే వేలకు వేలు ప్రజాధనాన్ని అప్పనంగా జీతాలు తీసుకున్నప్పటికీ సొంత పనులకు ఎక్కువ సమయం కేటాయిస్తారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. మత్స్యశాఖ వల్ల రైతులకు ఎటువంటి ఉపయోగం లేదని, సన్న చిన్న కారు రైతులు సరైన అవగాహన లేక లోకల్‌గా దొరికే రొయ్య పిల్లలను తీసుకువచ్చి చెరువుల్లో వేయటం ద్వారా ఎక్కువగా వైరస్ బారిన పడినట్లు రైతులు చెబుతున్నారు. ఒక్క చెరువుకు వైరస్ వ్యాపిస్తే వేల ఎకరాల ఆక్వా చెరువులు ఖాళీ అవుతున్నాయి. దీంతో పెద్ద మొత్తంలో రైతులు అప్పులు పాలు అవుతున్నారు. గత క్రాపులో నష్టపోయిన నష్టాలను గట్టెక్కేందుకు మరో క్రాప్ వేచి చూద్దామని, దొరికిన కాడికి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఆశ చావక సాగును ప్రారంభిస్తే చెరువులో రొయ్య బతికే పరిస్థితి లేదని, నష్టం వస్తే లక్షల్లోనే ఉంటుందని, దీంతో ఉన్న ఆస్తులను తెగ అమ్మడం లేక, అప్పులు తీర్చలేక ఆత్మహత్యే శరణ్యమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా ఈ రంగానికి సంబంధించిన సంబంధిత మత్స్యశాఖ అధికారులు మాత్రం కనీసం రొయ్య ఎందుకు చనిపోతుందో, సమస్యలు ఏంటో, రైతులకు మెరుగైన ఫలితాలు సాధించడానికి ఎటువంటి చర్యలు చేపట్టాలో, రైతులను ఎలా లాభాల బాట పట్టించాలో అని కనీస ఆలోచన చేయకపోవడం మత్స్యశాఖ అధికారుల బాధ్యతారహితానికి నిదర్శనమని చెప్పవచ్చు.

కౌంటింగ్ రాకుండానే పట్టుబడి పడుతున్న రొయ్యలు

జిల్లాలో భీమవరం, నరసాపురం, ఆకివీడు, ఉండి, గణపవరం, ఆచంట మండలాల్తో పాటు జిల్లా వ్యాప్తంగా 49,040 వేల ఎకరాల్లో పెద్ద ఎత్తున ఆక్వా రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. ఈ జిల్లాలో ఆక్వా సాగు వల్ల ఎంతోమంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లా కూడా పెద్ద ఎత్తున ఆక్వా ఎక్స్‌పోర్ట్ వల్ల ఆదాయం బాగానే వస్తుంది. అలాంటి ఈ రంగం గత నాలుగేళ్ల నుంచి అనేక రకాల వైరస్‌లు రొయ్యలపై పడటంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో మత్స్యశాక ఉన్నప్పటికీ అధికారులు మాత్రం ఏం చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. ఒకపక్క రైతులు నాణ్యమైన సీడ్ లభించకపోవడంతో అవగాహన లేక వారు ఏదో ఒక సీడ్ తీసుకువచ్చి వేయడం వల్ల రొయ్య కనీసం నెల రోజులు కూడా లేకుండా చెరువుల్లోనే చనిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. దీనికి తోడు ఎక్కడైనా చెరువుల్లో రొయ్యలు బతికినప్పటికీ ఓపక్క విద్యుత్ ఛార్జీలు పెరిగిపోయాయని రైతులు లబోదిబోమంటున్నారు. గతంలో 1800 ఉండే మేత బస్తా ప్రస్తుతం రూ.2300కు పెరిగిపోయిందని, దీనికి తోడు నిత్యం అవసరమయ్యే ప్రొవైటిక్, ఇతర మందులు, ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయని, వీటిపై నియంత్రణ లేదని, అడిగే వారు లేరని, దీంతో చెరువు కరెంట్‌కి వచ్చిన తమకు మిగిలేది శూన్యమని, పెట్టుబడులు కూడా రావట్లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఈ రంగం వేల ఎకరాలు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వం నిక్కి ఆదాయం తెచ్చిపెట్టే రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నాణ్యమైన సీడ్ రైతులకు అందిస్తే మంచి కౌంట్ రొయ్యలు పండించుకొని తాము కూడా అప్పుల నుంచి గట్టెక్కుతామని రైతులు చెబుతున్నారు. రైతులను ఆదుకునేందుకు సాగులో ఉన్న రైతులకు వివరించాలని వారు కోరుతున్నారు.

ఆక్వా చెరువు..

ఐక్య ఉద్యమాలు నిర్మిస్తాం

ఎపి ప్రభుత్వ ఉపాధ్యాయ జెఎసి ఛైర్మన్ కెఆర్.సూర్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గత కొన్నేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్లు ఆత్మ గౌరవం కోల్పోయి బతుకుతున్నామని, ప్రభువుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి దుర్భర పరిస్థితుల్లో ఉన్నామని, హక్కులు అడుగుతుంటే కేసులు పెడ్తున్నారని ఎపి ప్రభుత్వ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్ల సంఘాల జెఎసి ఛైర్మన్ కెఆర్.సూర్యనారాయణ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా శాఖ అధ్వర్యంలో ఆదివారం భీమవరంలో జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్ల చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగ వర్గాల్లో ఆత్మస్థైర్యం నింపడానికి రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. 12వ పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన పాతిక వేల కోట్ల రూపాయల బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భజన సంఘాలు ప్రభుభక్తితో హక్కుల అమలు కాకుండా అడ్డుకుంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. టీచర్లు ప్రమోషన్ లేకుండానే పదవీ విరమణ చేస్తున్నారని, ఉపాధ్యాయులతో మరుగుదొడ్లు కడిగించిన ఘనత ప్రస్తుత సర్కారుదేనని, ఇదిలా ఉంటే విద్యాశాఖ ప్రిన్సిపుల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులకు నరకం చూపిస్తున్నాడని ఆయన విమర్శించారు. గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇంకా విధివిధానాలు లేకపోవడం శోచనీయమన్నారు. ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం అయ్యిందన్నారు. కాని వారి పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా అయ్యిందని ధ్వజమెత్తారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్ అందించిన ఎలక్షన్ కమిషన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చట్టబద్ధ హక్కుల సాధనలో ముప్పై సంఘాలు ఏకతాటిపైకి వచ్చాయని, న్యాయబద్ధంగా తమకు వచ్చే వాటిని ఒదిలే ప్రసక్తిలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి కో ఛైర్మన్ కరణం హరికృష్ణ, స్టేట్ జనరల్ సెక్రెటరీ బాజీ పఠాన్, జిల్లా ఛైర్మన్ జిఆర్‌ఎస్‌ఎన్ రాజు, జిల్లా కార్యదర్శి చంద్రమౌళి పాల్గొన్నారు.

ఎస్‌విజి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరులోని ప్రఖ్యాత విద్యాసంస్థ ఎస్‌విజి ఉన్నత పాఠశాలలో 1994-1999లో 6 నుంచి 10వ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ రాజతోత్సవ సంవత్సర సమ్మేళనం ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగింది. ఈ సందర్భంగా స్థానికంగా, రాష్ట్రేతర, దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు వందలాదిగా కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. పాఠశాలలో తమకు విద్య నేర్పిన విశ్రాంత ఉపాధ్యాయులకు, బోధనేతర సిబ్బంది 15 మందికి ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు, స్థానికులు అందరూ వినోద కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు మల్లిడి నాగార్జున రెడ్డి, సోమంచి శ్రీనివాస శాస్త్రి, ఎస్.హైమవతి, ఎం.సత్యవతి, డిటివి ఆచార్యులు, కడలి లక్ష్మీనారాయణ, పి.చంద్రశేఖర రెడ్డి, ఎస్.భాస్కర రెడ్డి, నాన్ టీచింగ్ శాస్త్రి, బాపిరాజు, రామచంద్రరావు పాల్గొన్నారు.

మహిళలపై యువకుల దాడి

ఆందోళన చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి - నరసాపురం

పేరుపాలెం బీచ్‌కు వెళ్లి తిరిగి వస్తున్న మహిళలపై కొందరు యువకులు దాడి చేశారు. దీనికి సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం కావడంతో పేరుపాలెం బీచ్‌కు వెళ్లి ఆటోలో తిరిగి వస్తున్న పది మందిని నరసాపురం మండలం తూర్పుతాళ్లకు చెందిన బళ్లా బాబి, ఆయన అనుచరులు లక్ష్మణేశ్వరానికి చెందిన కడలి మధు, ఆచంట వేమవరానికి చెందిన బొక్కా లక్ష్మి, బొక్కా శ్రీనివాస్‌ను తీవ్రంగా కొట్టారు. వీరితోపాటు అందులో ప్రయాణిస్తున్న మహిళలు, వృద్ధులు, చిన్నారులని చూడకుండా తాగిన మత్తులో మీరు ఏపార్టీకి ఓటు వేశారు.. తాము పలానా పార్టీ అని చెప్పి వారిని కొట్టి అసభ్య పదజాలంతో దుర్భాషలాడారు. స్థానికులు కలుగజేసుకుని గాయపడిన వారిని నరసాపురంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన బాధితులను నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాస్ పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. నిందితుడు బాబిని పోలీసులు అదుపులోకి తీసుకుని తీసుకెళ్తుండగా తమకు అప్పజెప్పాలని బాధితులు కోరారు. ఈ విషయంపై పోలీసులకు, బాధితులకు తీవ్ర వాగ్వివాదం జరిగింది. భారీ ఎత్తున ఆసుపత్రికి జనాలు చేరుకున్నారు. నిందితునిపై చర్యలు తీసుకోవాలని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

చికిత్స తీసుకుంటున్న మహిళ

ఆందోళన చేస్తున్న మహిళలు

ఆర్థికసాయం చేస్తున్న సభ్యులు

విద్యార్థిని కంటి వైద్యానికి వాకర్స్ క్లబ్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు బిఆర్‌ఎంవి పురపాలక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న చవ్వాని మేరీ బ్లాండినా అనే పేద విద్యార్థిని కంటి వ్యాధితో బాధపడుతూ విద్యాభ్యాసంలో ఇబ్బందులు పడుతోంది. దాతలు స్పందించి కొంత ఆర్థిక సాయం అందించగా ఇంకనూ అవసరమైన రూ.5 వేలను వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకర్, సభ్యులు కొత్త కుళాయి చెరువు వద్ద అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, సలాది రామచంద్ర రావు, బొలిశెట్టి నాగరాజు, మేకా త్రిశూలపాణి పాల్గొన్నారు.

మానవత సభ్యురాలు ఆదిలక్ష్మి మృతికి సంతాపం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మానవతా ఆత్మీయ సహకారంలో ఎప్పుడూ ముందుండే పడాల ఆదిలక్ష్మి మృతి తీరని లోటని మానవతా స్వచ్ఛంద సంస్థ జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణ మూర్తి అన్నారు. మండలంలోని మార్టేరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన కొందరు మానవత సభ్యుల కుటుంబాల వారిని సంస్థ ప్రతినిధులు పరామర్శించారు. ఈ సందర్భంగా మార్టేరుకు చెందిన పడాల ఆదిలక్ష్మి (63) ఆకస్మిక మృతికి, పడాల వీరెడ్డి కుటుంబానికి సంతాపం తెలియజేశారు. మానవత ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు, కార్యదర్శి బండి ప్రసాద్, సత్యనారాయణమూర్తి, ఛైర్మన్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి, కో ఛైర్మన్ పడాల జగన్నాథ రెడ్డి, యోగా గురువు పడాల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. యాత్రికులు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

పాస్‌పోర్టు పోయినది

CHINTA SUBBA LAKSHMI అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.22-05-2019న T0937892 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.06-05-2024న మా ఇంటి నుండి నరసాపురం పట్టణం మెయిన్‌రోడ్‌కు వెళ్తున్నపుడు నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

CHINTA SUBBA LAKSHMI
W/o. Chinta Durga Prasad
D.No. 3-4-11, Near Raithu Bazar,
Jampavari Street, Narasapuram-534275 Dt., A.P.